# కన్విక్షన్

"ఈ రోజుల్లో ప్రతి రెండోవాడూ తాను రచయిత ననుకుంటాడు. రెండు మూడు పత్రికల్లో ఉత్తరాల శీర్షికలో పేరు అచ్చుకాగానే ఉత్త(ర) రచయితలై పోతున్నారు. ఆ తరువాత కథలు వ్రాయడానికి ఎగబడుతున్నారు. ఏదో పేరు అచ్చులో చూసుకునే కీర్తి కండూతి తప్పించి, వీరికి తాము చేసే రచనల పట్ల సరియైన అవగాహన లేదు. తాము వ్రాసేదానికీ, నిజ జీవితంలో చేసేదానికీ హస్తిమశకాంతర భేదం వుంటుంది. అన్ని కోణాలు పరిశీలించి, నిజాయితీతో, కన్విక్షన్‌తో చేసిన రచనే అసలైన రచన. అదే పది కాలాలపాటు నిలుస్తుంది. పాఠకుల మన్ననలు పొందుతుంది." చప్పట్లు మారుమోగాయి. ప్రసిద్ధ రచయిత శ్రీ కోనేటి జాంబవంతులు (కోజా) గారు "కథాసదస్సు"లో చేసిన ఈ ఉపన్యాసానికి శ్రోతలందరూ మంత్రముగ్ధులయ్యారు. ఏదో ఒక నీతి చెప్పే వారి కథలే కాదు, వారి ప్రసంగం కూడా సందేశాత్మకంగా వుందనుకున్నారు.

"అభిరుచి" సంస్థ ద్వారా రాజమండ్రిలో జరిగిన ఈ సదస్సుకు ముఖ్య అతిథులు శ్రీ కోజా గారే.

ఆనవాయితీ ప్రకారం నిర్వాహకులు, వారికి వసతి కల్పించి, హైద్రాబాదు - రాజమండ్రి మధ్య రవాణా ఖర్చులతో పాటు అయిదునూట పదార్లు కూడా చదివించారు.

అయితే వారు స్వయంగా వ్రాసి ఇచ్చిన ఖర్చుల పట్టిక చూసి "అభిరుచి" సంస్థ కార్యదర్శి ఆశ్చర్యపోయాడు.

1) హైద్రాబాదు-రాజమండ్రి రానూ, పోనూ ఫస్ట్ క్లాస్ రైలు బాడుగ.

2) రాజమండ్రిలో ఇతర ఖర్చులు.

ఇందులో ఆశ్చర్యపడడానికి ఏముందని మీరనుకోవచ్చు. డెబ్భై అయిదేళ్ల వయస్సున్న శ్రీ "కోజా"గారు హైద్రాబాదు నుండి వచ్చింది ఒక అభిమాని కారులో. తిరిగిపోయేది కూడా ఆ కారులోనే. అదీకాక ఆయన ఎప్పుడు ప్రయాణం చేసినా, 65 సం. పైబడిన వృద్ధులకు లభించే ఇరవై అయిదు శాతం రాయితీ టిక్కట్టుపైనే వెళతారు. అది ఆ కార్యదర్శికి తెలుసు. కాని ఇక్కడ ఆయన క్లెయిమ్ చేసింది పూర్తి టిక్కట్టు బాడుగ.

ఇక రాజమండ్రిలో ఆయనకయిన ఖర్చులేం లేవు.

ఆయన రాజమండ్రిలో కాలుపెట్టిన దగ్గరి నుంచి తిరిగి హైద్రాబాదు బయలుదేరేదాకా ఒక టూరిస్టు కారు "అభిరుచి" సంస్థ ప్రతినిధితో పాటు ఆయన ఆధీనంలోనే వుంది. కిళ్లీ, వక్కపొడి, ఫలహార, భోజన సమస్త ఖర్చులూ ఆ ప్రతినిధే భరించాడు.

'"నిజాయితీ", "కన్విక్షన్" వున్న రచయిత కదూ?' అని అనుకున్నాడు ఆ కార్యదర్శి.

**(మయూరి వారపత్రిక)**